# మనమూ మేమూ

(అనేక భాషల్లో యీ వ్యత్యాసం లేదు. వినేవాణ్ణి కలుపుకున్నా వేరుచేసినా ఒకటేమాట వుంటూ వుంటుంది. వేరువేరు మాటలు ఘనమైన భాషల్లో తెలుగు ఒకటి.)

1

"రాజయ్యా, నాన్నగారి హయాంలో యెట్లా వెళ్ళిపోయిందో వెళ్ళిపోయింది. ఇప్పుడు పెత్తనం మనదే. పేరుకు నేనేగాని నిజానికి యిదంతా మీదే. మీరంతా భారం మీదేసుకుంటేనేగాని జరగదు. నేను నిమిత్తమాత్రుణ్ణి. మీరు మీమీ పనులు శ్రద్ధగా తెలివిగా చేశారా అందరమూ రాణిస్తాం. లేదూ, అందరికీ కళంకమే."

"బుద్ధెరిగిన తరవాత యింత మంచి ముక్కలు చెవిన పళ్ళేదు, బాబూ! పెద్ద బాబుగార్ని యెంత శ్రద్ధాభక్తులతోనో సేవించాంగాని ఆయన మమ్మల్ని కూలిచేసుకునే నౌకర్లకన్న యెక్కువగా చూళ్ళేదు. బాబూ - అంటే మీకు కష్టంగా ఉంటుందేమో గాని!-"

"పిచ్చివాడా, నేను మటుకెరగనా? నాన్నగా రదోరకం మనిషి, అన్నిపన్లూ తనే చూసుకోగలనని ఆయనకు మహా ఉండేది. ఆయన తెలివిగలవాడే అనుకో, ఎంత తెలివిగలవాడైతే మట్టుకు అన్నీ ఒక్క మనిషి చూడగలడా? అందులో యెఫిషెన్సీ - అంటే... పనితనం అన్నమాట! - లేదు అని నా అభిప్రాయం సుమా!"

"బోలెడంత చదువుకున్నవారు, తమరికి తెలియదా యేమిటండి?"

"అవునా? నాన్నగారి హయాంలో కళాకాంతులేమైనా వుండేవేమో చూడు! ఈ ఇల్లూ, ఈ ఆవరణా, ఈ తోటా చూడూ!"

"వాటికేమండి. మన యిల్లు లాంటిది ముప్పై అమళ్ళలో లేదండి" -

"అయ్యో, రాజయ్యా! నువు బొంబాయి చూడకపోతివి! అక్కడ మలబారు హిల్‌మీద - అంటే మలబారు కొండన్నమాట? - అక్కడి యిళ్ళ ముందిది ధూపానికి పనికొస్తుందా?"

"ఎక్కడో మంచిళ్ళుండకుండా ఉంటయ్యా అండి?"

"ఎక్కడో ఉండటమేం? మనకు లేకపోవటమేం? మనది డబ్బు కాదా? ఇంటినీ తోటనీ అందంగా చేసుకోవటానికి మనమో యాభై వేలు ఖర్చు పెట్టుకోలేమటోయ్. రాజయ్యా?"

"పెట్టుకోవాలనుకుంటే యెందుకు పెట్టుకోలేం లెండి?"

"అనుకోవటమేమిటి? యాభై వేలూ ఖర్చు పెట్టి తీరుదాం. మనకింత భగవంతుడిచ్చినందుకు అనుభవించకుండా దేనికి, రాజయ్యా?"

"అంత ఖర్చు యిప్పుడు దేనికనండి?"

"అట్లా అడుగు చెబుతాను. ఈ చిన్న చిన్న వూళ్ళల్లో చూస్తానుగదా, కాస్త గొప్పవాళ్ళ యిల్లు కనిపెట్టి వున్న వాళ్ళకీ కొద్దిపాటి యిల్లు కనిపెట్టి వుండేవాళ్ళకీ జీవితం ఒకటిగానే ఉంటుంది. అసలు గొప్పయిళ్ళూ కొద్దియిళ్ళూ అన్నీ ఒకటిగానే యేడుస్తయ్! ఫలాని రాజయ్యా ఫలాని వారి నౌకరీలో ఉన్నాడంటే వాణ్ణి చూసి వాడి తరగతి వాళ్ళంతా అసూయపడాలి. ఒక్కోసారి నాకనిపిస్తుంది సుమా, ఈ వందలేసి ఎకరాలకు బదులు ఏ బకింగ్‌హాం పాలెస్‌లోనో ఓ చిన్న దర్వానుగా ఉంటే జీవితం ఎంత హాయిగా ఉంటుంది గదా అని ఆ దర్వాను రోజల్లా బకింగ్‌హాం పాలెసులో గడుపుతాడుగద. అది వాడిల్లే! నిన్నూ నన్నూ అందులోకి అడుగుపెట్ట నివ్వరే! అబ్బే!"

"అట్టాగాండి?"

"ఆహా!... అదే నేను చెప్పేది. మన ఈ తోటంతా చక్కగా దార్లు వేయించి, బోర్డర్లు నాటించి పూల మొక్కలు వేయించాలి. మన ఇంటిముందు కారు పెట్టటానికి పోర్చి కట్టించాలి. దానిమీదికి లతలు పాకించాలి. ఏ లతయితే బాగుంటుందంటావు?"

"సొరపాదులు పెట్టిస్తామా అండీ?"

"ఛీ, ఛీ, ఛీ! సొరపాదేమిటి. రాజయ్యా! నా ఉత్సాహమంతా పాడు చేస్తివే!"

"చక్కగా కాయలు కాస్తుందండి. ఇంత తోట ఉన్నందుకు కాయకూరల సౌకర్యం లేకుండా యేమిటికండి?"

"చెబితే నమ్మవుగాని, రాజయ్యా, బకింగ్‌హాం పాలెసు తోటల్లో ఒక్క సొరపాదు కూడా లేదు, ఒక్కటి కూడా!"

"కాయగూరలే లేవా అండీ?"

"కిమిన్నాస్తి! మాట్లాడగూడదు!"

"మరి తోట అంటే ఏ ముంటైయండి!"

"ఏవో పూల మొక్కలూ అవీ ఉంటై."

"వాళ్ళు పూలు జాస్తిగా పెట్టుకుంటారు కామల్లండి?"

"పిచ్చి రాజయ్యా, దొరలు పూలు పెట్టుకుంటారా? వాళ్ళు పూలను చెట్లమీదే చూసి ఆనందిస్తారు?"

"మనకట్టా కుదురుతుందా అండీ? మన తోట్లో పూలమొక్కలేస్తే అమ్మగారూ, చిన్న దొరసానిగారూ పూలు కోసుకోరా, వూళ్ళో నలుగుర్నీ పిలిచి యిచ్చుకోరాండి?"

"అదయినా అంత యిబ్బంది లేదుగాని పోర్చిమీద, దాం దుంప తెగా, సొరపాదు, దానమ్మ కడుపు కాలా, పాకించమంటివే, నీ తస్సదియ్యా!"

"ఏదో తెలీకన్నాను. బాబూ!"

"నేనది మొదటే గ్రహించాలే!... అయిందా! ఓ మంచి కారొకటి అర్జంటుగా కొనాలి-"

"మోటారుకారే!"

"ఏమిటంత ఆశ్చర్యం! బొంబాయిలో మనలో సహం ఆస్తిలేని వాళ్లుకూడా కార్లల్లో రంయిమని పోతారుసుమా."

"కాని మన ఈ పల్లెటూళ్ళో-"

"కారున్న తరవాత ఊళ్ళోనే తిరుగుతామా ఏమిటి? అకస్మాత్తుగా పని పడిందనుకో. ఇట్టే పదినిమిషాల్లో బస్తీ చేరుకోవచ్చు."

"అదీ నిజమేనండి!"

"ఆ తరువాత రేడియో సెట్టుకూడా ఒకటి కొందామనుకుంటున్నా".

"అదేమిటండి?"

"అది చూస్తే నువ్వు నిజంగా ఆశ్చర్యపోతావు సుమా! ఇక్కణ్ణించే మనం మద్రాసులో పాడే సంగీతం గాని, బొంబాయిలో పాడే సంగీతంగాని వినవచ్చు. చెబితే నమ్మవుగాని, రాజయ్యా, లండనులో మాట్లాడుతుంటే ఇక్కడికి దానిమీద వినిపిస్తుంది."

"ఆశ్చర్యమేనండి."

"నాగరికత ఆ రోజు కారోజు అట్లా సాగిపోతున్నది. రాజయ్యా, ఇక్కడ మనం, ఈ ముష్టి పల్లెటూళ్ళో కూర్చుని ప్రపంచం గురించి ఏం తెలుసుకుంటున్నాం!"

"అవునండి, కాని మీరివన్నీ యేర్పాటు చేస్తే-"

"అదే నేనన్నది. మన ఊళ్ళోకి కాస్త నాగరికత తెద్దామనే నా ప్రయత్నం. జీవితంలో సారపాదులేకాక, యింకా చాలా ఉన్నయ్యని మన ఊరి వాళ్లకు తెలియజేయాలని నా ప్రయత్నం."

"ఎందుకులేవండి? అంకినీడుగారి వాముల్దొడ్లో గుమ్మడిపాదు పాకిందిగదా-"

"సరే, ఇక నువు వెళ్లు. రాజయ్యా! నాకు తొందరపనులున్నై."

"చిత్తం. సెలవు పుచ్చుకుంటానండి."

2

"రాజయ్యా, మన తోట ఇప్పుడెట్లా వుంది?"

"నిక్షేపమంటి వేపచెట్లు రెండూ కొట్టించేస్తిరి. నాకు దొడ్డేగాని తోట ఎక్కడా కనిపించటం లేదండి. ఈ రెండు వేపులా గులకరాళ్ళ దార్లు వేయించారుగాని అవెక్కడికీ పోవాయె. గుండ్రంగా తిరిగి మళ్ళా అక్కడికే వస్తున్నెగాని?"

"నీకీ విషయాలు తెలీవు. రాజయ్యా, నీకే యేమిటి, యిక్కడ ఎవరికీ తెలీవు. కాని తొందరపడకు. మనవాళ్ళ కన్నీ తెలియజేస్తాగా. తోట కనిపించటంలేదన్నావా, కొంచెం ఆగు అదే కనిపిస్తుంది. బోర్డర్లూ అవీ యిప్పుడేగా నాటాం. మొక్కలు కూడా కాస్త పెరిగితేగాని శోభ కనిపించదు. ఇంక ఈ దారులెందుకంటావా, మనం హాయిగా తిరగటానికి. ఈ దార్ల వెంబడి దిమ్మెలు కట్టిస్తున్నా. మనం సాయంకాలం పూట కూర్చోటానికి."

"చిత్తం. మన మోటారు బండి యెప్పుడొస్తుందండి?"

"ధరలు మరీ మండిపోతున్నై రాజయ్యా, మోటారంటే భయమేస్తున్నది. అయినా మాననే్ల; సెకండు హాండు కారయినా కొని తీరుతా. కొన్ని సెకండుహాండు కార్లు కొత్త కార్లకన్న బాగా పోతైసుమా. అయినా మన ఊళ్ళో అసలు కారేలేదు గనక సెకండు హాండు కారయినా గొప్పే, చెట్టులేని చోట ఆముదపు చెట్టే - ఏదీ?"

"అంతేనండి.... మన రేడియో నిన్న సాయంకాలం పాడించినట్టున్నారండి? పాట మన తూర్పు పొలాల దగ్గిరికి వినిపించిందట."

"అట్లాగేం? మనవాళ్ళంతా పాట విన్నారేం?"

"ఫలానా పాటనవుతే తెలియలేదుగాని యేదో విన్నారండి."

"నీకు వినిపిస్తారా రాజయ్యా... నిన్ననే మన వాళ్ళందర్నీ పిలుద్దామనుకున్నాగాని యేం పన్లమీదుంటారోనని మళ్ళా పిలవలా... ఇదుగో, చూశావా చూడటానికే సెట్టెంత ముచ్చటగా వుందో, దీనికోసం అయిదొందలు పోశాను. రాజయ్యా అయిదొందలు!"

"ఎత్తునెత్తు వెండన్న మాటండి".

"బాగా చెప్పావు. అయితే ఏంలే! అది పాడేపాట విను..."

"పుణ్యానికి పెట్టె కాస్తా పగిలిపోతుందేమో. తరువాత పాడిద్దురు గాన్లెండి."

"ఆ చప్పుళ్లు చూసి నువు భయపడుతున్నావు గామల్లు. అది దానికి పరిపాటే."

"అదుగో పాడుతున్నదండి. మీరు దాన్ని నిలపకుండా ఉన్నారు."

"అది మనక్కావలసిన స్టేషనుకాదు, నీకన్ని స్టేషన్లూ వినిపిస్తాలే... ఇదుగో ఇది ఢిల్లీ... ఇది మద్రాసు... ఇది బొంబాయి-"

"ఉణ్ణివ్వండి. ఉణ్ణివ్వండి. చక్కగా యెవరో మంగళహారతి పాడుతున్నారు."

"మంగళ హారతులకేంలే! ఇందులో ఇంకా హాలండూ, బెల్జియమూ, స్వీడనూ, డెన్మార్కూ, అమెరికా, యిరాన్ అన్నీ వస్తయ్."

"మనం విననికాడికి యేం వచ్చి యేం లాభమండి."

"ఎందుకు వినమూ? ఇదిగో ఇది ఇంగ్లండు లాగుంది. అంటే లండనన్న మాట."

"అట్లాగా అండి. మరి ఆ ఊరులో పాటలు లేదేమిటండి."

"ఇప్పుడు లేదు. కాస్సేపు ఉంటే వస్తుంది."

"అక్కడ ఇప్పుడు పాడేవాళ్ళే లేరా అండి?"

"ఉంటే వినే వాళ్ళమేగా?"

"మరి వాళ్ళెపుడు పాడతారో మనకెట్లా తెలుస్తుందండి?"

"పుస్తకంలో చూస్తే తెలుస్తుంది. ఇదుగో, చూశావా, యిదీ పుస్తకం."

"అందులో ఎవరెవరు ఎప్పుడెప్పుడు పాడేదీ అంతా రాసుంటదా అండి?"

"ఆహా!"

"మన ఊళ్ళో మాదిరిగా ఆ దేశాల్లో వాళ్ళు ఇష్టం వచ్చినప్పుడు పాడుకోరా అండి?"

"పాడుకుంటారు, కాని మనం వినేది ముందుగా చెప్పి పాడేవాళ్ళనే. అంతా చాలా గొడవుందిలే. చెప్పినా నీకర్థం కాదు."

"ప్రపంచకం రాను రానెంత విచిత్రంగా అవుతున్నదండి."

"ఆ విషయం మీ అందరికీ తెలియాలనేగా నా ప్రయత్నం?"

"మాకేమీ అర్థం అయే విషయాలు కావాయెను. ఏం లాభమండి?"

"చూస్తూ ఉంటే క్రమంగా అవే అర్థం అవుతై మరి."

3

"చూడు, రాజయ్యా, యిదేం బాగాలేదు."

"ఏదండి?"

"రోజూ మీ పనిచేసే కుర్రాళ్ళు మా తోటలోనే కూచుంటారు. వాళ్ళకి చూస్తే పనీపాట లేమీ లేవా ఏమిటి?"

"మన ఊరివాళ్ళ కిటువంటి తోటచూట్టం కొత్త గనక చూసి ఆనందించటానికి వస్తున్నారండి. పనీ పాటలు లేనప్పుడే వచ్చి కూచుంటారండి – వాళ్ళ చేతిమీదుగా వేసింది గనుక –"

"పనీ పాట ల్లేకపోవడ మేమిటి? చేసుకునే వాడికి క్షణం తీరుతుందా అసలూ? రోజల్లా ఇక్కడికొచ్చి వనవిహారం చేసే తిరణాల ప్రజని చూస్తే ఇది మా తోటో ఊళ్ళో వాళ్ళ తోటో తెలీటంలేదు."

"తోటలోకి రావద్దని అందరితోనూ చెబుతాలెండి."

"ఆ పని చెయ్యి, రాజయ్యా, నీకు పుణ్యం ఉంటుంది... నేనన్నానని ఎవరితోనూ అనకు సుమా. నీ అంతట నువ్వే అన్నట్టుగా అను."

"తప్పేముంది లెండి?"

❖ ❖ ❖

"చూడు, రాజయ్యా రేడియో వేసుకోవటానికి భయంగా వుంది. అలగా జనమంతా యింటి చుట్టూరా వేళ్లాడుతున్నారు. ఎట్లాచావు? పొండర్రా అంటే పోరే. రేడియో పెట్టి మూణ్నాళ్లయింది. చెబితే నమ్మవుగాని."

"ఎంత చిక్కొచ్చి పడ్డదండి."

"చిన్న చిక్కా? హాయిగా పొలాల్లో క్కూడా వినిపిస్తుంది గదా, యింటి చుట్టూ మూగటం దేనికి చెప్పు?"

"చెబుతాలెండి."

"మళ్ళా నేనన్నానని–"

"లేదులెండి నేనే అంటా!"

❖ ❖ ❖



కథా నిలయం శ్రీకాకుళం

"ఏంటో తొందర పని మీదొచ్చావు, రాజయ్యా."

"రోసాయి గాణ్ణి మన పోట్ల ఆంబోతు పొలంలో పడదోసి కాళ్ళు రెండు విరగదొక్కిందండి. ఆసుపత్రిలో పారెయ్యాలి. స్పృహ తప్పి పడున్నాడు. కాస్త దయ ఉంచి మనకారు బయటికి తీస్తే-"

"ఇంకానయం రోశాయిలకూ భూషాయిలకూ కార్లలవాటు చేస్తే యింకేమన్నా వుందా? అయినా మాణిక్య మంటి కార్లో కాళ్లు విరిగినవాణ్ణి కూచోబెట్టితే కారంతా నెత్తురైపోదుటోయ్?"

"త్వరగా ఆసుపత్రి చేర్చటానికి-"

"చూస్తావేం మరీ? వేగిరం బండి కట్టించు, వేగిరం పోతై నల్లగిత్తల్ని తగిలించు".

"రెండు గంటలన్నా పడుతుందండి, ఎడ్లబండి మీదయితే, ఈ ఒక్కసారికి కారు దయచేస్తే-"

"రెండు గంటలేగా! ఇంతలో మునిగిపోలే! ఆస్పత్రిలో మటుకు వెళ్ళగానే మొహం చూస్తారేమిటి?"

"అవున్లెండి!"

❖ ❖ ❖

"ఎక్కడా కనిపించటం లేదు, రాజయ్యా?"

"రోశాయి దగ్గిర ఆస్పత్రిలో బడున్నానండి."

"కాస్త నయంగా ఉందా?"

"రాత్రి రోశాయి పోయినాడండి!"

"అట్లాగా? నాకు తెలీదే?"

"ఊళ్ళో అందరికీ తెల్లారక మునుపే తెలిసిందండీ."

"నాకెవరూ చెప్పలేదేం? ఊరి పెద్దనుగదా నాకు తెలియక్కర్లా, రాజయ్యా?"

"ఎవరికి తెలిసి ఏముందిలెండి? ఊరి కళపోయింది. ఎక్కడ చూసినా రోశాయే ఉండేవాడు. రోజల్లా పాడుతూ ఎగురుతూ ఊండేవాడు. సినిమా పాటంత చమత్కారంగా పాడేవాడండి! పాట పాడుకుంటూ ఎంత చాకిరయినా చేసేవాడు. ఈ పని నా వల్ల కాదనేవాడు కాదండి. పెద్ద బాబుగారు వాణ్ణి తన పెంపుడు కొడుకని చెప్పుకునేవారు. కన్న ఒక్క కొడుకూ పోయి ఆ ముసల్ది అల్లాడుతుంటే చూడశక్యం కాకుండా వుంది..."

"పోనీ చూడు, రాజయ్యా, ఊళ్ళో జనం రోశాయిని మరిచేదాకా మనరేడియో వింటూండమను."

"రోశాయికి రేడియో సాటొస్తుందాండి? ఎక్కడి మాట?"

❄

రూపవాణి, ఆగస్ట్ 1944